క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలన



కల్యాణ మండపం నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజినీర్ సతీష్, చైర్ పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఎంపీ నిధులతో నిర్మించే కల్యాణ మండపం స్థలాన్ని ప్రముఖ ఆర్కిటెక్ ఇంజినీర్ బుద్ధవరపు సతీష్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని 23వ వార్డులో చెరువు గట్టు స్థలంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, మున్సిపల్ కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్ తెలిపారు. సంబంధిత కల్యాణ మండపం ప్లాన్, స్థలానికి చెందిన సోయల్ టెస్ట్ రిపోర్టులను ఆర్కెటిక్ ఇంజినీర్ సతీష్ పరిశీలించి మున్సిపల్, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సూర్యనగర్‌లోని నిర్మాణంలో ఉన్న త్యాగరాజ గాన సభ నిర్మాణం పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోలమూరు శివాజీ, కౌన్సిలర్లు నల్ల అంజమ్మ, కేత శ్రీను, బాసిన నాగమణి, పార్టీ నాయకులు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి కృష్ణ, కోటి దుర్గారావు సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



డాక్టర్ శ్రావ్యను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సత్యలత, సుజాత తదితరులు

రామచంద్రపురం: ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రముఖ వైద్యురాలు శ్రావ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ కేసీ సత్యలత అధ్యక్షతన ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, సిప్ విభాగంలో డాక్టర్ ఎన్.సుజాత, డాక్టర్ సారా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ ఆడపిల్లలు ఆరోగ్యం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్య సమస్యలు వస్తే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం డాక్టర్ శ్రావ్యను ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యలత, సుజాత, సారా తదితరులు ఘనంగా సత్కరించారు.

వాహనాల పార్కింగ్‌కు బహిరంగ వేలం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో వాహనాల పార్కింగ్, భక్తులు సమర్పించిన సగం కొబ్బరి చెక్కలు, వస్త్రాలు దక్కించుకునేందుకు లైసెన్సుల నిమిత్తం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాది కాలం పాటు ఆయా కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్‌వీ దుర్గాభవాని, కోటిపల్లి దేవస్థానం ఈఓ శ్రీదేవి, పసలపూడి గ్రూపు దేవాలయాల ఈఓ ఎస్.అయ్యప్పరాజు సమక్షంలో వేలం నిర్వహించారు. వేలంపాటల ఖరారు విషయాలను దేవదాయ శాఖ కమిషనర్ పరిశీలన అనంతరం వెల్లడిస్తామని ఈఓ దుర్గాభవాని తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి సునీల్‌కుమార్



కాజులూరు: మండలంలోని గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సునీల్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్‌బీ సుశీలమణి శుక్రవారం తెలిపారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ఏడో వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట సేవలందించిన 78 మంది ఉపాధ్యాయులు ఎంపిక చేసి గురుబ్రహ్మ పురస్కారాలతో సత్కరిస్తుందన్నారు. దీనిలో భాగంగా తమ పాఠశాలకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్ పురస్కారానికి ఎంపికయ్యారన్నారు. శనివారం కాకినాడ సూర్యకళామందిర్‌లో రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా చేయూత స్వచ్ఛంద సంస్థ పురస్కారాలను అందజేయనుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, ఎస్ఎంపీ చైర్మన్ కె.సత్యం తదితరులు వ్యాయమ ఉపాధ్యాయుడు సునీల్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

సామూహిక నివారణ

- ఎలుకల నివారణకు రైతులు, అధికారుల ప్రత్యేక దృష్టి
- సామూహిక నివారణ చర్యలతో మంచి ఫలితాలు
- అన్నదాతలకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ



కుందూరులో ఎలుకల మందు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



మండల వ్యవసాయాధికారి వి.అశోక్

కాజులూరు: పంటలపై ఎలుకల దాడి రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా మూషికాలు పొలాల్లో వరి పంటను కొరికిపారేస్తున్నాయి. చీడపీడలను నివారిస్తూ ఎరువులు వేసి ఏపుగా పెంచిన వరిపంట ఎలుకల దాడికి నాశనమవుతుంటే రైతులు లబోదిబోమంటున్నారు. ఎలుకల నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం నామమాత్రంగానే ఉంటోంది. బుట్టలు పెట్టినా, బొరియల్లో పొగపెట్టి ఊదరపెట్టినా, మందులు ఎన్ని వాడినా ఎలుకల ఉధృతి తగ్గటం లేదు. దీంతో ఎలుకల నివారణకు అధికంగా ఖర్చు అవ్వటమే కాకుండా ఎలుకలు దాడికి ఎకరానికి 10 బస్తాల వరకూ దిగుబడి తగ్గి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయిన మండల వ్యవసాయశాఖాధికారి వి.అశోక్ తెలిపారు. ఒక ప్రాంతంలోని రైతులందరూ ఒకేసారి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు గ్రామాల్లో అన్నదాతలకు రైతు సేవా కేంద్రాల ద్వారా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేస్తున్నారు.

మందు తయారీ ఇలా...

జీవరాశుల్లో మనిషి, తిమింగళం తరువాత ఎలుకే తెలువైన జీవి. ఎలుక మందు తిని తక్షణమే చనిపోయే పరిస్థితి వచ్చినప్పుడు ఆ సంకేతాలను ఇతర ఎలుకలకు అందిస్తుందని, ఫలితంగా అవి మందు జోలికి వెళ్లవని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. వ్యవసాయ శాఖ సరఫరా చేస్తున్న బ్రోమోడయోలిన్ మందు వలన ఎలుకలో స్లో పాయిజన్ మాదిరి రక్తనాళాలు స్తంభించి మూడు లేదా నాలుగు రోజుల తరువాత చనిపోతుందన్నారు. దీంతో మందు పెట్టిన ఒక్కటి, రెండు రోజుల్లో దాదాపు పొలంలోని ఎలుకలనీ తింటాయన్నారు. హెక్టారు పొలానికి అర కేజీ మందు అవసరమవుతుందని చెప్పారు. ఇందు కోసం రైతులు 480 గ్రాములు నూకలు, పది గ్రాముల నూనె, పది గ్రాములు బ్రోమోడయోలిన్ మందును కలిపి విషపు ఎరను తయారు చేసుకోవాలన్నారు. ఆ మందును మూడు అంగుళాల వ్యాసం, 18 అంగుళాల పొడవు కలిగిన పీవీసీ పైపుల్లో 30 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి పొలానికి నాలుగు మూలలా గట్లపై అమర్చుకోవాలి. వారానికి రెండు సార్లు తజాగా తయ్యారు చేసిన ఎరను మార్చుకోవాలన్నారు. పీవీసీ పైపులు వాడటం వలన విషపు ఎర ఎండా, వానలకు పాడవ్వకుండా ఉండటమే కాకుండా పక్షులు, పెంపుడు జంతువులకు అందకుండా మెరుగైన ఫలితాలను ఇస్తుందని చెప్పారు.



కాజులూరులో ఎలుకల దాడికి గురైన వరిపొలం

52 వేల ఎకరాల్లో సాగు

రామచంద్రపురం నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు వరిసాగు చేశారు. కాజులూరు మండలానికి 81 కేజీలు, రామచంద్రపురం మండలానికి 80 కేజీలు, కె.గంగవరం మండలాలకు 82 కేజీలు చొప్పున బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం సరఫరా చేసింది. గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఫ్లై ఓవర్ వద్ద తుప్పల తొలగింపు



ఫ్లైఓవర్ గోడ లో మొలకెత్తిన మొక్కను తొలగిస్తున్న కార్మికులు

మండపేట: ద్వారపూడిలో ఫ్లై ఓవర్ రోడ్డుకు ఇరువైపులా, ఫ్లై ఓవర్ రోడ్డు దిగువ రోడ్లలో పెరిగిపోయిన తుప్పల తొలగింపును ఆర్అండ్ బీ అధికారులు చేపట్టారు. గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేటపుడు మార్గం కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. వారి విజ్ఞప్తి మేరకు అధికారులు స్పందించి ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఆర్అండ్‌బీ డీఈ సూర్యనారాయణ పర్యవేక్షణలో తుప్పలు తొలగించి, రోడ్డును కూడా శుభ్ర పరిచారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కందుల పాలెంలో బంధువుల ఇంటికి వచ్చిన వృద్ధురాలు అదృశ్యమైనట్టు ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... అనపర్తి మండలం పొలమూరు గ్రామానికి చెందిన మల్లి సత్యవతి అనే వృద్ధురాలు ఈ నెల 11న కందులపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి పొలమూరుకు బయలుదేరింది. ఆమె పొలమూరుకు చేరుకోకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద, పరిసర గ్రామాల్లోను వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి వివరాలు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై లక్ష్మణ్ కోరారు.

18న మండపేట మండల సమావేశం

మండపేట: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఎంపీడీవో సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ



హసన్‌బాదలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తాళ్లపోడులో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలంతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సూర్యావతి మాట్లాడుతూ పోషకాహారంతో గర్భిణులు, బాలింతలు రక్త హీనత నుంచి బయటపడి మెరుగైన సమాజం సాధించడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, ఉప సర్పంచ్ నీలం గంగాభవాని ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ భాస్కరలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కె.గంగవరం: గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ పర్యావేక్షకురాలు పార్వతి చంద్రకళ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం తాళ్లపోడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకరంగా ఉండాలని కోరారు. ప్రజలకు పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారాన్ని పరిశీలిస్తున్న చైర్ పర్సన్‌శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రీరామ రక్ష అని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. పోషణ మహోత్సవాల్లో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి చైర్‌పర్సన్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను చైర్ పర్సన్ శ్రీదేవి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణిగా ఉన్నప్పుడే పోషకాహారం తీసుకోవాలన్నారు. మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం బేబీ షో నిర్వహించి తక్కువ వయసు ఎక్కువ బరువు ఉన్న చిన్నారుల తల్లులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వరాహాలక్ష్మి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, వార్డు కౌన్సిలర్లు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటర్ల నమోదు



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

మండపేట: పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించామని తహసీల్దార్ తేజేశ్వరరావు, సహాయ ఓటరు నమోదు అధికారి మెహెర్‌బాబా తెలిపారు. దీనిపై శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నాయకుల సలహాలు, సూచనలు స్వీకరించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎన్నికకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉందన్నారు. ముందస్తుగా మండపేటలో ఎన్నికల నిర్వహణకు పోలింగ్ బూత్, ఓట్ల నమోదు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సభ్యులందరి ఆమోదం మేరకు మండల పరిషత్ కార్యాలయాన్ని పోలింగ్ స్టేషన్‌గా కేటాయించామని వారు తెలిపారు. అలాగే ఓటు నమోదుకు ఫారం -19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, ఇతర పార్టీల నాయకులు ఎం.సుబ్బారావు, వుంగరాల రాంబాబు, డిప్యూటీ తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

22న శెట్టిబలిజ సంఘ సమావేశం



వెంకటాయపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలోని శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో ఈ నెల 22న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు పిలుపు ఇచ్చారు. మండలంలోని వెంకటాయపాలెంలోని పిల్లి అప్పారావు బీసీ కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ 22న తాలూకా శెట్టిబలిజ సంఘం గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అధ్యక్షతన సంఘ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని సంఘ పెద్దలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కట్టా గోవిందు, పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీలు గుత్తుల అచ్యుతవేణి, నులుకుర్తి శ్రీరామకృష్ణ, నాయకులు అనుసూరి రమణ, పెంకే వీరరాఘవులు, రాయుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెన్నికాయిట్ కోచింగ్



శిక్షణ పొందిన క్రీడాకారులతో కోచ్, తదితరులు

మండపేట: పట్టణంలో నిర్వహించిన సబ్ జూనియర్ టెన్నికాయిట్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఏడిద రోడ్డులోని శ్రీ వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ శిబిరం జరిగింది. శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయని కోచ్ కుంచె రమేష్ తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకూ శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించే 36వ టెన్నికాయిట్ పోటీల్లో ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు నాగకుమార్, పీడీ శ్రీనివాస్ శిక్షణ పొందిన క్రీడాకారులను అభినందించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి క్రీడాకారులకు క్రీడా దుస్తులు, షూస్ బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ ఆటగాళ్లు వడ్డాది, వినయ్ కుమార్, పిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ సౌభాగ్య వ్రతం



శ్రీ లక్ష్మీ సౌభాగ్య వ్రతంలో పూజలు చేస్తున్న మహిళలు

రాయవరం: స్థానిక ఈశ్వరరెడ్డినగర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద శుక్రవారం లక్ష్మీ సౌభాగ్య వ్రతం నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గణపతి కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధానార్చకుడు యలమంచిలి సత్యనారాయణశర్మ అర్చకత్వంలో రోజూ ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, సాయంత్రం 108 ఫలాలతో ఫలార్చన తదితర పూజలు నిర్వహిస్తున్నారు. రాయవరం పరిసర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో లక్ష్మీ సౌభాగ్య వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి కమిటీ సభ్యులు పులగం శ్రీనివాసరెడ్డి (పీఎస్ఆర్), కొవ్వూరి వెంకట రామారెడ్డి, కోనాల సుధాకర్‌రెడ్డి, వెలగల హేమ మణికంఠరెడ్డి, సబ్బెళ్ల త్రినాథరెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి (మందులషాపు శ్రీను), సబ్బెళ్ల జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా దీపోత్సవం



బస్‌స్టాండ్ వద్ద దీపాలు వెలిగిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మండపేట: గణపతి నవరాత్ర మహోత్సవాలతో పట్టణమంతా కోలాహలంగా ఉంది. మంటపాల్లో కొలువు తీరిన గణనాథులకు వారం రోజులుగా భక్తులు భక్తితో పూజలు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి బస్‌స్టాండ్, సైధిల్‌పేట, వల్లూరి వారి వీధుల్లో దీపోత్సవం కన్నుల పండవగా జరిగింది. సైధిల్‌పేట స్నేహమిత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్మీ గణపతిని జబర్దస్త్ నటి వర్ష దర్శించుకుని సందడి చేశారు. అనంతరం జరిగిన లడ్డూ పాటలో ఆమె పాల్గొన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు దంపతులు లక్ష్మీ గణపతికి విశేష పూజాదికాలు నిర్వహించారు. తొలుత బస్‌స్టాండు, సైధిల్‌పేట ప్రాంతాల్లో నిర్వహించిన అఖండ దీపాలంకరణల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథులుగా పాల్గొని దీపోత్సవాన్ని ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వేగుళ్ల వీరవెంకట సత్యనారాయణచౌదరి సతీమణి వేగుళ్ల రేణుకాచౌదరి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణలు, టీడీపీ యువనేత వేగుళ్ల అజయ్‌బాబు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నీలం దుర్గమ్మ, శెట్టి కళ్యాణి, పిల్లి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. అనంతరం వినాయకులకు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమాల్లో అయినవిల్లి రాజేష్, కాయల సాయిబాబు, కాయల రాము, రేలంగి రమేష్, కాయల చంద్రశేఖర్, రావూరి ప్రసాద్, నున్న అంజిబాబు, జీఆర్‌సీ మోహన్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కోళ్ల శ్రీనివాస్, అద్దూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

కపిలేశ్వరపురం: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సీపీఎంకే కాకుండా ఇతర వామపక్ష పార్టీలకు,, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జిత్తుక వీర్రాజు శుక్రవారం ఓ ప్రకటనలతో సంతాపాన్ని వ్యక్తం చేశారు. చదువుకొనే రోజుల నుంచి పేదల పట్ల అమితమైన ప్రేమతో ప్రజా సమస్యలను అధ్యయనం చేయడం ఏచూరి ప్రత్యేకత అన్నారు. విద్యాధిక కుటుంబానికి చెందడంతోపాటు వ్యక్తిగతంగా స్థిరపడే అనేక అవకాశాలున్నా ప్రజా ఉద్యమాల వైపే ఏచూరి ఆలోచనలు నిలబడటం నేటి యువతకు ఆదర్శమని వీర్రాజు అన్నారు.

శ్మశాన వాటికలో సీసీ రహదారి నిర్మాణం

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక శ్మశానవాటికలో సీసీ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. శ్మశానవాటికలో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు దహన సంస్కారాలు చేస్తున్నారు. ఆ ప్రదేశమంతా మట్టితో నిండి ఉండడంతో పిండ ప్రదానాలు చేసేందుకు అవస్థ పడేవారు. రహదారి నిర్మాణంతో శ్మశానవాటిక సౌకర్యవంతం కానుంది.



పడమర ఖండ్రిక శ్మశానవాటికలో సీసీ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న శ్రామికులు

గోదావరి వరద తగ్గుముఖం



కేదారిలంక ర్యాంపు వద్ద వెనక్కి మళ్లిన గోదావరి



వానపల్లి కాజ్‌వే వద్ద తగ్గుముఖం పట్టిన వరదనీరు

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరిలో వరద తగ్గుముఖం పట్టింది. మూడు రోజులుగా భయాందోళనలకు గురి చేసిన వరద ఎట్టకేలకు తగ్గింది. కేదారిలంక సూర్యగుండాలు పాయ కాజ్ వే వద్ద గురువారంతో పోలిస్తే సుమారు నాలుగున్నర అడుగులు తగ్గింది. పల్లపులంక, అద్దంకివారిలంక, వీధివారిలంక, నారాయణలంక, వానపల్లి కాజ్‌వేలు వద్ద వరద తగ్గడంతో ఆయా గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద పరిస్థితిని తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, కార్యదర్శులు, ఇతర సచివాలయ ఉద్యోగులు వరద పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించారు. అంగర, వానపల్లి, వీరవల్లిపాలెం పీహెచ్‌సీల వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు.